


—పిప్పళ్ళ సూర్యప్రకాశరావు

ఈసారి సుబ్బారావుకి నిజంగా జబ్బు చేసింది.

నిజంగా అని ఎందుకు వ్రాశానంటే సుబ్బారావుకి ప్రతి నెలా జబ్బు పడటం రివాజా, పాపం, అర్భకుడు సుబ్బారావు అని మీరనుకుంటే మీరు పొరపాటు పడ్డారు.

జబ్బులు, రెండు రకాలు. డబ్బులు పోసేవి; డబ్బులు తెచ్చేవి.

మొదటి రకం వచ్చినవంటే ఒంట్లో ఉన్న శక్తితోబాటు ఇంట్లో ఉన్న డబ్బును కూడా హరించేస్తాయి.

రెండవ రకానివి ఒంటికి రావు. కాగితం మీదే వస్తాయి. మందులు కాగితం మీదే కొనబడతాయి. డాక్టరు కూడా కాగితంమీదే నయం చేస్తారు. రోగాల్ని బట్టి మందులు వ్రాయరు డాక్టరు. మందులకే సరి అయిన రోగాలు అతుకుతారు. తరవాత అనుకున్న ప్రకారం డాక్టరుగారి జేబులో కొన్ని కాగితాలు (నోట్లు), దొంగజబ్బు ఓనర్ జేబులో కొన్ని కాగితాలు, రాముడు కొంటే గోవిందుడు కొన్నాడని బిల్లు లిచ్చిన మందులషాపు వాడి జేబులో కొన్ని నోట్లు చోటు చేసుకుంటాయి. అడపా తడపా మధ్యవర్తి జేబులో కొన్ని నోట్లు చేరడం కూడా కద్దు.

మార్చి 30 వ తారీఖునే (31 వ తారీఖున ఆర్థిక సంవత్సరం అంతమవుతుంది కాబట్టి!) ఒకానొక డాక్టరు సుమారు రెండు వేల మందిని పరీక్షించి అందరికీ ఖరీదైన రోగాలున్నాయని చెప్పాడట!

ఆ కంగారులోనేమో పాపం! మరొక డాక్టరు "ప్లెక్సి షూ" బిల్లుని "బి–కాంప్లెక్స్" బిల్లుని కౌంటర్‌సైన్

చేశారట!

ఒక విధంగా చెప్పాలంటే, ప్రభుత్వోద్యోగులు నడుపుతున్న, దేశంలో అభివృద్ధి పొందుతున్న పెద్ద వ్యాపార మిది. పెట్టుబడి అక్కర్లేదు. అంతా లాభమే. ఈ వ్యాపారం ఎంత దారుణంగా వృద్ధి చెందుతుందంటే ఎప్పుడో ఒకప్పుడు ప్రభుత్వం రోగాలన్నింటినీ జాతీయం చేసెయ్యవచ్చు. దీన్నే మనం 'మందుల ఖర్చులు భర్తీ చేసే పథకం' అందాం. కాని, చాలా మంది తెలుగు పాఠకులు ఇంగ్లీషులోనే అర్థం చేసుకుంటారు కాబట్టి 'మెడికల్ రీఇంబర్స్‌మెంట్ స్కీమ్' అందాం.

ఈ పథకాన్ని సద్వినియోగం చేయుడానికి కేంద్ర ప్రభుత్వోద్యోగులతో రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు పోటాపోటీ పడుతున్నారని వినికిడి.

ప్రతి నెలా సుబ్బారావు సుమారు వీభై రూపాయలు సంపాదించటం (కొట్టెయ్యటం) ఈ పథకం ద్వారానే. గుమాస్తా కాబట్టి అంతే తీసుకుంటాడని, లేకపోతే ఇంకా ఖరీదు గానే జబ్బు పడే వాడని వినికిడి.

ఒంటరిగా ఉంటే తక్కువ ముడుతుందని జంట తెచ్చుకున్నాడని కిట్టని వాళ్ళు అంటూ ఉంటారు. ఆడవాళ్ళ మందులు వాళ్ళు కట్టే చీరల్లాగే ఖరీదు గానే ఉంటాయని సుబ్బారావు నమ్మకం. కాని, 'సంచి లాభం చిల్లు కూడ దీసిం'దన్నట్లు వాళ్ళావిడకు జబ్బుని తాకట్టుకునే డబ్బు కంటె ఆవిడ కట్టే చీరలు ఖరీదవటం వల్ల పెళ్ళి చేసుకోవడం పొరపాటే నని చాటుగా ఒప్పేసుకుంటాడు.

ఓ రోజున హెడ్‌గుమాస్తా పిలిచి, "సుబ్బారావూ! నీ కని ఒక నెల, మరొక నెల నీ పెళ్ళానికని, మరో నెల పిల్లల కని రీ ఇంబర్స్‌మెంట్ బిల్లు నీవు పెడ్తున్నావు కదూ? అసలు ఈ బిల్లులన్నీ ఒరిజినల్ బిల్సేనా?" అని నిలదీశాడు.

అంతే. తెల్లవారి వాళ్ళ పిల్ల పుట్టిన రోజని తెలుసుకున్న సుబ్బారావు బుట్టెడు పళ్ళు పట్టుకెళ్ళి హెడ్‌గుమాస్తా మ్మగారికి ఇచ్చి వచ్చాడు. అప్పటినుంచీ ఆయన సుబ్బారావుని బిల్లు గురించి అడిగితే ఒట్టు!

అప్పుడప్పుడు వాళ్ళ ఆఫీసరు సుబ్బారావు బిల్లు చూసి కుళ్ళిపోతూ ఉంటాడు. ఒక రోజున—"సుబ్బారావూ! నీవు నిజంగా జబ్బు పడ్డావా?" అన్నాడట ఆఫీసరు.

అంతే, సుబ్బారావు చిరుచుకుపడి పోయాడు. "జబ్బు ఎందుకు పడ్డావు?" అని అడగటం రాజ్యాంగ మిచ్చిన ప్రాథమిక హక్కులతో జోక్యం కలిగించుకోవడమేనని, బుల్లి బుల్లి కోర్టులలో ఓడిపోయినా ఢిల్లీ వెళ్ళి ప్రధాన న్యాయ మూర్తి ఉంటే ఫుల్‌బెంచికి విన్నవించుకుంటానని అనగానే కుర్ర ఆఫీసరు కంగారుపడి మరి నోరెత్త లేదు.

అయినా, సుబ్బారావు మీద కొంత మంది కన్నేసి ఉంచారు.

* * *

ఏ మాట కా మాటే చెప్పుకోవాలి. ఈ సారి నిజంగానే సుబ్బారావు జబ్బు పడ్డాడు. బయట బోర్డు కట్టిన ప్రైవేటు డాక్టర్లు ఎంత ప్రతిమిలాడినా వినకుండా తిన్నగా ధర్మాసుపత్రికే వెళ్ళాడు. నేతి బీరకాయలో నేయి ఎంత పేరుకుని ఉంటుందో అంత ధర్మం ధర్మాసుపత్రిలో దొరుకుతుందని తెలియని అమాయకుడు కాడు సుబ్బారావు. కాని, గవర్నమెంటు డాక్టరు సంతకం పెడితే గాని, కొన్ని మందులకు డబ్బు రాదు ప్రభుత్వం దగ్గరనించి.

"బాగున్నారా?" సుబ్బారావుని పలకరించాడు డాక్టరు గది ముందున్న

### మిత్రులు - పుస్తకాలు

మంచి స్నేహితులను సంపాదించుకున్న తర్వాత మంచి పుస్తకాలను సంపాదించి పెట్టుకోవడం అవసరం. కష్టకాలంలో స్నేహితులు ఆదుకుంటే, పుస్తకాలు ఆత్మ కాంతిని ప్రసాదిస్తాయి.

—కోల్టన్

సింహాచలం. జ్వరంతో ఒళ్ళు మండి పోతున్న సుబ్బారావుకి మరింత ఒళ్ళు మండింది.

అస లిటువంటి పలకరింపులంటే తనకి ఒళ్ళు మంట. మొన్నటికి మొన్న పక్కింటాయన సినిమా హాల్లో తనని చూడనే చూశాడు. కాని, వేళ కాని వేళగా కాయులు కొంటుంటే—"ఏమండీ, సినిమా కొచ్చారా?" అని పలకరించాడు, తనేదో తప్పు కొట్టినట్లు. రామారావు ఒకసారి రైల్లో కనబడి, "ఏరోయ్, ఊరెళ్ళుతున్నావా?" అన్నాడు. తను బాత్‌రూమ్ కొచ్చాడా?

తనొకసారి కొత్తగా కొనుక్కున్న ప్లైలట్ పెన్‌ని అందరికీ కనపడేలా జేబులో పెట్టుకుని తిరుగుతుంటే, "ఏరోయ్! పెన్ను కొన్నావా?" అన్నాడొకడు. ఇంక నయం ఎత్తు కొచ్చావా? అనలేదు.

అసలు ఇలా పలకరించవాళ్ళు తెలిసి పలకరిస్తారో, లేక ఏం మాట్లాడాలో తెలియక అలా పేలతారో తెలియదు.

లేకపోతే హాస్పిటల్‌కి వచ్చే వాడు ఎవడైనా బాగుంటాడా?

సింహాచలాన్ని తిట్టుకుని, ఎవరో కుంటుకుంటూ వస్తుంటే పరికించి చూశాడు సుబ్బారావు. అది భుజంగం.

"గురో! బాగున్నావా?" అని ఈ సారి తను పలకరించి, నాలుక కరుచుకున్నాడు సుబ్బారావు.

"కళ్ళు కనపడుతున్నాయా?" బుస కొట్టాడు భుజంగం.

"నాకు మాత్రం కనపడుతున్నాయి, బాబూ! నీ సంగతి నాకు తెలియదు. అది సరేగాని పడ్డావా? పచ్చ కాగితం కొట్టేస్తావు, రీ ఇంబర్స్‌మెంట్ బిల్లు పెట్టి. ఎముకలు విరిగే ఉంటాయి" అన్నాడు సుబ్బారావు.

"వెధవ. నా ఎముకలు విరగలేదు గానీ, నీ ఎముకలు నేను విరగ్గొడతాను. నీ ఏడుపు నీదే, బాధతోటి నే చస్తుంటే."

"చచ్చేవు లేవోయ్. కాస్త ఓర్చుకో. ఎలాగైనా, భుజంగం, నీవు అదృష్టవంతుడివోయ్. నాకూ వచ్చింది బోడి జ్వరం." వాపోయాడు సుబ్బారావు.

"ఒరేయ్! నీవుకూడా జ్వరాన్ని క్షయగానో, డయబిటిస్‌గానో, లేక కాన్సర్ గానో మార్చుకుని ఇంట్లో మూణ్ణెల్లు కూర్చుంటే నీకూ వస్తాయిగా బోలెడన్ని పచ్చనోట్లు!" అన్నాడు భుజంగం.

"చిప్పకూడా వస్తుంది. అప్పుడేం చేస్తారో తెలుసా? రోగిష్టి వెధవకి ఉద్యోగం ఎందుకని తీసి అవతల పడేస్తారు. పిచ్చివాడా! బుర్రుంటే నీ లాగ షోగ్గా కుంటుకుంటూ నడవక్కర్లేదు. ఇంట్లో కూర్చో నక్కర్లేదు. ఎవరి వాటా వాళ్ళ కిచ్చేస్తే చాలు" అన్నాడు సుబ్బారావు.

"అంటే?"

"అర్థం కాలేదా అవున్లే, అర్థమయితే ఎందుకిలా పాకుపోతావు ఉన్న ఉద్యోగంలో?" పక్కనున్న నల్లటతనెవరో పళ్ళికిలించాడు. కొందరు నవ్వితే బాగుంటారు; మరికొందరు నవ్వకపోతే బాగుంటారు.

పక్కనున్నతను నవ్వకపోతే బాగుంటాడు. సుబ్బారావే మళ్ళీ అందుకున్నాడు.

"అర్థం కాకపోతే సిగరెట్ పాకెట్టిలా పడేయ్" అన్నాడు.

"ఇది పెనాల్టీయా?" సిగరెట్ పాకెట్టు ఏడుస్తూ ఇచ్చాడు భుజంగం.

"అగ్గిపెట్టుందా?" అన్నాడు సుబ్బారావు. సిగరెట్లు తాగే వాళ్ళ కిదో జబ్బు. సిగరెట్లు ఉంటే అగ్గిపెట్టె ఉండదు. అగ్గిపెట్టె ఉంటే సిగరెట్లు ఉండవు. అఫ్‌కోర్స్ కొందరి దగ్గర రెండూ ఉండవు.

అగ్గిపెట్టె ఇచ్చాడు భుజంగం. సిగరెట్లు ఒక దమ్ము గట్టిగా లాగి, అమాయకుడా అన్నట్టు భుజంగం వైపు ఒకసారి చూసి, "వాటాలు సరిగా పంచేస్తే పేషెంట్ డాక్టరు దగ్గరికి వెళ్ళడు. డాక్టర్ పేషెంటును చూడడు. ఎందుకు చూడ్డం? రోగికి రోగం లేదుగా! మధ్యవర్తే అంతా చూసుకుంటాడు."

"మరి తమరెందుకిలా తగలడ్డారో!" అనుమానం వచ్చేసింది భుజంగానికి.

"నిజంగా జ్వరం మొచ్చింది కాబట్టి. మధ్యవర్తి ఈ మధ్య ఎక్కడో చచ్చాడు కాబట్టి." నల్లటతను మళ్ళీ నవ్వాడు. సుబ్బారావుకి ఎక్కడా చూసినట్టు లేదు. నోటి పరిచయం గానీ, కనీసం 'నోటు' పరిచయంగానీ లేదు. కొంప తీసి ఏజెంటేమో? వీళ్ళ దగ్గిర (ఫ్రీ శాంపిల్స్) లాగా చిరునవ్వులు చాలా దొరుకుతాయి!

"గురో! ఏం చెప్పావు! నీ కేమిచ్చినా ఋణం తీర"దని, ఇచ్చిన సిగరెట్ పాకెట్, అగ్గిపెట్టె లాక్కుని చక్కా పోయాడు భుజంగం డ్రెస్సింగ్ రూమ్ వైపు. నల్లటతను లైన్లో నిలబడ్డాడు సుబ్బారావు వెనకాల.

* * *

"పేరు?" డాక్టరు. "సుబ్బారావు."

"ఎక్కడ పని చేస్తున్నారు?"

చెప్పాడు.

"సుబ్బారావుగారిని మీ కెరుగరూ, డాక్టర్" ఆశ్చర్యంగా అడిగాడు నల్లటతను.

సుబ్బారావు పెరుగులో వేసిన గారెలాగ ఉబ్బిపోయాడు తన పాపులారిటీ గురించి.

"వాట్, డాక్టర్! ఆశ్చర్యంగా ఉందే! రెండేళ్ళ నుండే ఆయన 'రీ ఇంబర్స్‌మెంట్ బిల్లు మీ రేగా కౌంటర్‌సైన్ చేస్తున్నారు'" "మీరా?" డాక్టరు, సుబ్బారావు. జేబులోంచి ఐడెంటిఫికేషన్ కార్డు తీసి ఇచ్చాడు విజిలెన్స్ ఆఫీసరు!

సుబ్బారావూ, డాక్టరూ బిత్తరపోయారని చెప్పకపోతే తెలుగు సినిమాలో సస్పెన్సులా ఉంటుంది! ★